నమస్తే తెలంగాణ

# మహబూబాబాద్

5 | మంగళవారం 30 జనవరి 2024 | MAHABUBABAD




వర్ధన్నపేట నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

## హామీలు నెరవేర్చకుంటే

# ప్రజలే నిలదీస్తరు..

**కాంగ్రెస్ రైతుబంధు ఇవ్వకుండా నోట్లో అరటిపండు పెట్టింది.. ఆ పార్టీని నమ్మి మోసపోయామని బాధపడుతున్నరు**

కేసీఆర్ కంటే గొప్పగా అదిచేస్తాం, ఇది ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని.. డిసెంబర్ 9న ఇస్తామన్న రైతు బంధు కూడా ఇవ్వలేదని.. హామీలు నెరవేర్చకపోతే ప్రజలే నిలదీస్తారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. అలాగే మతాల పేరుతో రాజకీయాలు చేసే మోడీకి మూడోసారి ప్రజలు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ అధ్యక్షతన సోమవారం హంటర్‌రోడ్ లోని సీఎస్‌ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వర్ధన్నపేట నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథి నిరంజన్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఇటు కేంద్రంలోని మోదీ, అటు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగిన నేతలు, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు అవలంబించాల్సిన తీరు, పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు.

– న్యూశాయంపేట, జనవరి 29

### మూడోసారి మోడీకి ఓట్లు ఎందుకు వేయాలి?

- అక్షింతల పేరుతో రాజకీయాలా? : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం
- బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలపై భౌతికదాడులు : మాజీ మంత్రి ఎర్రబెల్లి
- ప్రజల ళం, బలం, గళం ఎప్పటికీ బీఆర్‌ఎస్సే : మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్
- వర్ధన్నపేట నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

**విషప్రచారం వల్లే కాంగ్రెస్ గెలిచింది..**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 9న రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు వేస్తామని చెప్పి ఇంకా వేయలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ఆ పార్టీ విఫలమైంది. ప్రభుత్వం ఏర్పడిన 50 రోజుల్లోనే బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలపైన భౌతికదాడులు చేస్తున్నారు. కార్యకర్తలకు కష్టం వస్తే అందరం ఒకటి కావాలి. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో విషప్రచారం చేసి గెలిచింది. చిన్నచిన్న కారణాలతో మనం ఓడిపోయాం. కార్యకర్తల సూచనలు పరిగణనలోకి తీసుకొని పార్టీని బలోపేతం చేద్దాం.

– మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**గెలిచినా, ఓడినా ప్రజలతోనే..**

అధికారంలో ఉన్నా, లేకున్నా.. తెలంగాణ ప్రజల దళం, బలం, గళం ఎప్పటికీ బీఆర్‌ఎస్సే. ఇదే నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్దాం. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజం. ఓడిపోయినా నియోజకవర్గ ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి కృషి చేస్తా. పదేళ్లలోనే 50 ఏండ్ల అభివృద్ధిని కండ్లచూపిన ఘనత బీఆర్‌ఎస్ సర్కార్‌దే. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగరేద్దాం. జిల్లాలో పార్టీ బలోపేతంపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని ముందుకెళ్దాం. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలి. రైతుబంధు, సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి కోసం ఆయా వర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయాలి.

– అరూరి రమేశ్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు

కేసీఆర్ కంటే గొప్పగా చేస్తాం, ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఏం చేస్తున్నదని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. అదునుకు రైతు బంధు ఇవ్వకుండా నోట్లో అరటిపండు పెట్టిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారని, ఇచ్చిన గ్యారెంటీలను వంద రోజుల్లో కాకపోతే ఐదు సంవత్సరాల్లోగా నెరవేర్చండి అని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాలుగా ఎన్నో రాజకీయ పరిణామాలు జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం 15 ఏళ్లు అధికారంలో ఉన్నా ఏమీ చేయలేదన్నారు. కాంగ్రెస్‌తో పొత్తు లేకుండా పోటీ చేసి గెలిచామని, 2014, 2018లో ఉద్యమనేత కేసీఆర్‌ని ప్రజలు ఆదరించారని, అభివృద్ధే ఎజెండాగా ప్రభుత్వం ముందుకెళ్తున్న సమయంలో మరింత పట్టుదలగా శ్రమిస్తే ఫలితం మనదే ఉండేదని నిరంజన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని, విజయంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. పార్లమెంట్ సీట్లు కచ్చితంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. దక్షిణ భారతదేశంలో వరుసగా మూడుసార్లు ఏ పార్టీ కూడా అధికారంలోకి రాలేదని, ఎన్టీఆర్ హయాంలో కూడా ప్రభుత్వం మారిందని గుర్తుచేశారు. ఉద్యోగాల భర్తీ జరగలేదని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తున్నదని, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఉద్యోగులకు ఫిట్‌మెంట్ ఇచ్చామన్నారు. ఓటమిపై సమీక్షించుకొని పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



వర్ధన్నపేట నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

అనంతరం ఈ నెలతో పదవీ కాలం ముగియనున్న క్రమంలో నియోజకవర్గంలోని పలువురు సర్పంచులను అరూరి రమేశ్ సన్మానించారు. సమావేశంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, లలితా యాదవ్, జడ్పీ వైస్‌చైర్మన్ శ్రీరాములు, కోఆప్షన్ సభ్యులు ఉస్మాన్ అలీ, సర్వర్, కార్పొరేటర్లు రాధికారెడ్డి, శిబా–అనిల్, అరుణ–విక్టర్, రజిత–శ్రీనివాస్, దివ్యరాణి–రాజునాయక్, సిరంగి సునీల్, జడ్పీటీసీలు భిక్షపతి, సునీత, ఎంపీపీలు మధుమతి, అప్పారావు, సునీత, కమల, మున్సిపల్ చైర్మన్ అరుణ, శంకర్‌రెడ్డి, కుమారస్వామి, కుమార్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్, రాజు, కుమార్‌యాదవ్, నరసింహ, స్పందన్, జైపాల్, వినోద్, శ్రీకాంత్, శ్రీధర్, మునీంద్రనాథ్, రవీందర్, పాక్స్ చైర్మన్లు హరికృష్ణ, రాజేశ్‌కన్నా, దేవేందర్, మనోజ్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, రమేశ్, సంపత్‌రెడ్డి, శ్రీనివాస్, సమ్మయ్య, విజయ్, మార్కెట్ చైర్మన్ స్వామిరాయుడు, వైస్ ఎంపీపీలు రాజేశ్వరరావు, సోమలక్ష్మి–సోమయ్య, మోహన్, రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



నర్సంపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, పక్కన ఎంపీ కవిత

# నా ఓటమికి నేనే బాధ్యత వహిస్తా..

**కాంగ్రెసోళ్లు చిల్లర రాజకీయం చేస్తున్నరు**

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి**

**నర్సంపేటలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం**

నర్సంపేట, జనవరి 29 : నా ఓటమికి నేనే బాధ్యత వహిస్తానని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం నర్సంపేటలోని పద్మశాలీ ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పెద్ది మాట్లాడుతూ ఎవరి కోసం పార్టీ ఆగదన్నారు. కారు ఎక్కేవారు ఎక్కొచ్చు, దిగేవారు దిగొచ్చన్నారు. మూడు రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కార్యకర్తల సమావేశం నిర్వహించాలని సూచించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉన్నామన్నారు. ఇప్పుడు కూడా బీఆర్‌ఎస్ కార్యాలయం 24 గంటలు తెరిచే ఉంటుందని వివరించారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించనున్నారని, పార్టీ నిలబెట్టిన ఎంపీ అభ్యర్థిని గ్రామ, బూత్ స్థాయి నుంచి గెలిపించాలని కోరారు. కాంగ్రెసోళ్లు చిల్లర రాజకీయం చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. ఇంత వరకు రెండెకరాలకు పైన ఉన్న రైతులకు రైతుబంధు, పాకాలకు గోదావరి నీళ్లు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ప్రతిపక్షం అంటే ఎలా ఉంటుందో మనమందరం కాంగ్రెస్‌కు చూపించాలన్నారు. గత ఆరు నెలల నుంచి నర్సంపేట అభివృద్ధికి తెచ్చిన జీవోను ఎమ్మెల్యే ఆపాలని చెప్పడంతో ప్రభుత్వం నిలిపి వేసిందన్నారు. పనులను ఆపాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. వచ్చిన నిధుల్లో ఏ ఒక్క రూపాయి ల్యాప్స్ అయినా ఊరుకోబోమని హెచ్చరించారు. అనంతరం ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ లోకసభ బీఆర్‌ఎస్ అభ్యర్థి టికెట్ తనదేనన్నారు. తానే పోటీ చేస్తున్నానని సభా వేదికగా ప్రకటించారు. కార్యకర్తలు సమష్టిగా బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటమి చెందడంపై నిరాశ చెందవద్దన్నారు. మళ్లీ గెలిచేది బీఆర్‌ఎస్సే అని కార్యకర్తలు గుర్తుంచుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్, జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామీనాయక్, అన్ని మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఉర్సు దర్గా పీఠాధిపతి నవీద్‌బాబా, ఉబేద్‌బాబా

# 2 నుంచి 'ఉర్సు' ఉత్సవాలు

**వందల ఏళ్లుగా నిర్వహణ**

కరీమాబాద్, జనవరి 29 : వందల ఏండ్లుగా ఉర్సు దర్గా ఉత్సవాలను నిర్వహిస్తున్నామని పీఠాధిపతులు నవీద్‌బాబా, ఉబేద్‌బాబా తెలిపారు. సోమవారం ఉర్సు దర్గాలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 2 నుంచి 468వ ఉర్సు దర్గా (హజ్రత్ సయ్యద్ జలాలొద్దీన్ షా జమాలుల్ బహర్) ( సయ్యదనా మాషుక్ రబ్బానీ) ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. కాగా, ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు. ఫకీర్ల విన్యాసాలతో 2వ తేదీ రాత్రి ఉర్సు నయాఘడీలోని తన ఇంటి వద్ద నుంచి గంధాన్ని తీసుకువచ్చి పవిత్ర సమాధికి (గంధలేపనం) పూస్తామన్నారు. దీంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 3వ తేదీన ఉర్సు ఉత్సవాలు ప్రారంభమై 4న ముగియనున్నట్లు తెలిపారు. ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని సుప్రసిద్ధ ఇస్లామిక్ వేద పండితులతో ఆధ్యాత్మిక సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైలానీబాబా, చాంద్‌పాషా, మగ్దూం, గడ్డం యుగేంధర్ పాల్గొన్నారు.

# వెల్లుల్లి@రూ.400

- రెండింతలు పెరిగిన ధరలు
- సంక్రాంతి పండుగ నుంచే పెరుగుదల
- మధ్యప్రదేశ్‌లో తుపాన్‌తో దెబ్బ తిన్న పంట



మహబూబాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ అమాంతం పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం కూరగాయలతోపాటు ఉప్పు, పప్పుల ధరలు మండిపోతున్నాయి. మొన్నటివరకు ఆకాశాన్నంటిన ఉల్లి ధరలు ఇప్పుడిప్పుడే నేలకు దిగి వస్తున్నాయి. తాజాగా వెల్లుల్లి ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. సంక్రాంతి పండుగ ముందు వరకు కిలోకు రూ.180 నుంచి రూ.240 వరకు ఉండగా, ఇప్పుడు ఒక్కసారిగా కిలో వెల్లుల్లి ధరలు రూ.360 నుంచి రూ.400 వరకు పెరిగింది. మూడు రకాల వెల్లుల్లి మార్కెట్‌లో ఉంది. చిన్నగా ఉన్నవి కిలోకు రూ.360, మీడియం సైజు రూ.380, పెద్దవి రూ.400 పలుకుతున్నాయి. పెరిగిన వెల్లుల్లి ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బందిగా మారింది. వెజ్, నాన్‌వెజ్ కూరల్లో వెల్లుల్లి వేస్తేనే టేస్ట్‌గా ఉంటుంది. కర్రీ ఏదైనా వెల్లుల్లి తప్పకుండా వేయాల్సిందే. కానీ ఇప్పుడు కూర వండేప్పుడు దాన్ని వేయాలంటేనే జనం జంకుతున్నారు.

**మధ్యప్రదేశ్ నుంచి దిగుమతి**

వెల్లుల్లి మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాకు దిగుమతి అవుతుంది. వరంగల్ నగరంతోపాటు జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లా కేంద్రాలకు సరఫరా అవుతుంది. అక్కడ గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట బాగా దెబ్బతిన్నది. అక్కడి రైతులు తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటను తొలగించి కొత్తగా మళ్లీ పంట వేశారు. దీంతో గడ్డ చేతికి వచ్చేసరికి సమయం పట్టనుంది. పాత వెల్లుల్లి నిల్వలు అయిపోవడంతో ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్‌లోకి వస్తున్న కొత్త గడ్డకు ధర రూ.400 వరకు పలుకుతోందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతోంది. సంక్రాంతి పండుగ ముందు నుంచే వెల్లుల్లి ధరలు విపరీతంగా పెరిగాయని మానుకోట ఎల్లిగడ్డ హోల్‌సేల్ వ్యాపారి జనార్దన్ తెలిపారు. ధర ఒక్కసారిగా రెండింతలు పెరగడంతో ప్రజలు తక్కువగా కొంటున్నారని చెబుతున్నారు.

# బిల్ట్ కాలనీ క్వార్టర్స్ ఖాళీ చేయండి..

**నోటీస్ బోర్డులు ఏర్పాటు చేసిన కొత్త యాజమాన్యం**

మంగపేట, జనవరి 29 : పారిశ్రామిక ప్రాంతమైన కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీకి చెందిన కాలనీలో నివాసముంటున్న కార్మికులు క్వార్టర్స్‌ను ఖాళీ చేయాలని సోమవారం సాయంత్రం కొత్త యాజమాన్యం నోటీసులిచ్చింది. బిల్ట్ ప్రదేశాలతో పాటు, గోదావరి తీరంలోని ఇన్‌టేక్ వెల్ పరిసరాల్లోకి కార్మికులు, ప్రజలు రావద్దని అందులో పేర్కొన్నది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో బిల్ట్ కాలనీ ప్రవేశ ద్వారం, కర్మాగారం మెయిన్ గేట్ వద్ద నోటీసు బోర్డులు ఏర్పాటు చేసినట్లు యాజమాన్యం పేర్కొనడం గమనార్హం.

# మహిళా ఏఈని వేధించిన ఎస్సై అనిల్ వీఆర్‌కు అటాచ్

**విచారణ ఇంకా కొనసాగుతోంది**

**సెంట్రల్ జోన్ డీసీపీ బారి వెల్లడి**



ఎస్సై అనిల్

సుబేదారి, జనవరి 29 : మహిళా ఏఈని వేధించిన కేసులో ప్రాథమిక విచారణ అనంతరం ఎస్సై అనిల్‌ను కేయూసీ నుంచి వరంగల్ పోలీసు కమిషనరేట్ వీఆర్‌కు అటాచ్ చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ బారి సోమవారం తెలిపారు. ఇంకా పూర్తి స్థాయి విచారణ కొనసాగుతున్నదని ఆయన పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఎనుమాముల మార్కెట్‌లో డిసెంబర్ 3న నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు విధులకు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ చింతగట్టు క్యాంపులో ఏఈగా పనిచేస్తున్న మహిళా ఉద్యోగిని హాజరైంది. ఆ సమయంలో అక్కడ డ్యూటీలో ఉన్న కేయూసీ ఎస్సై జీ అనిల్ ఆమెను పరిచయం చేసుకొని ఫోన్ నంబర్ తీసుకున్నాడు. తర్వాత వాట్సాప్ ద్వారా అసభ్యకర మెసేజ్‌లు పంపిస్తూ సదరు మహిళా ఉద్యోగిని వేధించాడు. విషయం ఆమె భర్తకు తెలువగా, ఎస్సైతో గొడవకు దారితీసింది. తర్వాత మహిళా ఉద్యోగి ఎస్సై తనను వేధిస్తున్నాడని, ఆమె భర్త ఎస్సై తనను కులం పేరుతూ దూషించాడని వేర్వేరుగా ఫిర్యాదు చేయగా, ఈ నెల 21న ఎస్సై అనిల్‌పై సుబేదారి పోలీసు స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. అయితే మహిళా ఏఈ పనిచేస్తున్న చింతగట్టు క్యాంపు కేయూసీ పోలీసు స్టేషన్ పరిధి కావడంతో ఆమె కేసును కేయూసీకి ట్రాన్స్‌ఫర్ చేసినట్లు సుబేదారి పోలీసులు తెలిపారు. అలాగే ఆమె భర్త ఫిర్యాదు మేరకు ఎస్సైపై నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ కేసును వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ విచారణ చేస్తున్నట్లు చెప్పారు.


